


www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 27 | డిసెంబర్ | 2025 పేజీలు : 8


# కమ్యూనిజం అజరామరం






-సిపిఐ వందేళ్ల పండుగ
-వాడవాడల రెపరెపలాడిన అరుణ పతాకం
-జనవరి 18న చారిత్రక సభ
-కొత్తగూడెంలో జనసేవాదళ్ కవాత్
-ఖమ్మంలో ఆవిర్భావ సభ






కమ్యూనిజం అజేయం, అజరామరమని దోపిడీ ఉన్నంత కాలం ఆర్థిక అంతరాలు కొనసాగినంత కాలం ప్రజల పక్షాన కమ్యూనిస్టులు పోరాడుతూనే ఉంటారని సిపిఐ నేతలు తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆవిర్భావాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా వాడవాడల గ్రామ గ్రామాన సిపిఐ పతాకాలను ఆవిష్కరించారు. భద్రాద్రి కొత్తగూడెం పట్టణంలో జనసేవాదళ్ కవాత్ నిర్వహించారు. జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా నేతృత్వం వహించారు. పలు చోట్ల సిపిఐ పతాకాలను సాబీర్‌పాషా ఆవిష్కరించారు. ఖమ్మం నగరంలోని సిపిఐ కార్యాలయంలో శత వార్షికోత్సవాలను పురస్కరించుకుని సిపిఐ పతాకాన్ని జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ఆవిష్కరించగా పార్టీ కార్యాలయంపై సిపిఐ పతాకాన్ని జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆవిష్కరించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాలు, పార్టీ కార్యాలయాలు, ప్రధాన గ్రామాల్లో పార్టీ పతాకాలను సిపిఐ నాయకులు ఆవిష్కరించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లను ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ఘనంగా సన్మానించారు.

2లో

-ప్రజాపక్షం/ఖమ్మం

## ఇంటింటికీ చలిజ్వరం..!

-ముసురుతున్న రోగాలు
-పడిపోతున్న ఉష్ణోగ్రతలు





**ప్రజాపక్షం/జూలూరుపాడు:** దారుణంగా పడిపోతున్న ఉష్ణోగ్రతల వలన వాతావరణ మార్పులతో వైరస్ లు స్వైర విహారం చేస్తున్నాయి. జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్న ప్రజలు మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి ఉంటుందన్న వాతావరణశాఖ జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్య నిపుణులు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలవ్యాప్తంగా చలిపులి వణికిస్తోంది. భానుడి భగభగలు మాయమై. ఎముకలు కొరికే చలి పంజా విసురుతోంది. మండల వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోవడంతో చలి జ్వరం ఇంటింటినీ పలకరిస్తోంది. వాతావరణంలో ఒక్కసారిగా వచ్చిన ఈ మార్పులతో వైరస్‌లు స్వైరవిహారం చేస్తున్నాయి. ఫలితంగా ప్రతి ఇంటా జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పుల బాధితులు కనిపిస్తున్నారు. రానున్న మరి కొన్ని రోజులు ఇదే పరిస్థితి

మిగతా 2లో..

## లెక్కలు చెప్పకపోతే చిక్కులే..!



అభ్యర్థులు ప్రచార వ్యయం సమర్పించాలి

**ప్రజాపక్షం/చింతకాని :** జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలు రసవత్తరంగా జరిగాయి. ఫలితాలు వచ్చాయి. కోత్త పాలకవర్గాలు ప్రమాణ స్వీకారం చేశాయి. ఎన్నికల్లో గెలిచేందుకు సర్పంచి, వార్డు స్థానాల అభ్యర్దులు రూ. లక్షలు ఖర్చు చేశారు.అయితే వారంతా తమ ఖర్చుల వివరాలను తప్పనిసరిగా వెల్లడించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చుల వివరాలను ఎంపీడీవోలకు సమర్పించాలి. వాటిని అధికారులు అంతర్జాలంలో పొందుపరచాలి. ఈ ప్రక్రియ 2026 ఫిబ్రవరి 15లోపు తప్పకుండా పూర్తిచేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది.

### పంచాయతీల వారీగా..

ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ..5 వేల లోపు జనాభా ఉన్న పంచాయతీల్లో సర్పంచి అభ్యర్థులు రూ.1.50 లక్షలు, వార్డు స్థానాల అభ్యర్థులు రూ. 30 వేల వరకు ఖర్చు చేయవచ్చు. 5 వేలకు పైగా జనాభా ఉన్న పంచాయతీల్లో సర్పంచి అభ్యర్థులు రూ. 2.50 లక్షలు, వార్డు స్థానాల

మిగతా 2లో..

# కమ్యూనిజం అజేయం.. అజరామరం



**-చరిత్రలో నిలిచిపోయేలా జనవరి 18న బహిరంగ సభ**
**-జనవరి ఒకటి నుంచి సభలు, సమావేశాలు, ర్యాలీలు**
**-సిపిఐ నేత బాగం**
**-సిపిఐ ఆవిర్బావ దినోత్సవం సందర్భంగా పతాకావిష్కరణ**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** కమ్యూనిజం అజేయం... అజరామరమని మరో వందేళ్లు ప్రజల హృదిలో కమ్యూనిజం నిలిచి ఉంటుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ప్రజాపక్షాన సిపిఐ చేసిన పోరాటాలు, త్యాగాలు చిరస్మరణీయమన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ 100వ ఆవిర్బావ దినోత్సవం సందర్బంగా సిపిఐ పతాకాన్ని హేమంతరావు ఆవిష్కరించగా పార్టీ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌పై పార్టీ పతాకాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆవిష్కరించారు. అనంతరం గిరిప్రసాద్ భవన్‌లో మందడపు రాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాగం హేమంతరావు మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ఆవిర్భవించిన సిపిఐ వందేళ్ల సుదీర్ఘ ప్రస్తానంలో అనేక పోరాట విజయాలను సాధించిందన్నారు. ఆవిర్బావం నుంచి అనేక నిర్బంధాలను ఎదుర్కొని ప్రజల పక్షాన నిలిచిందన్నారు. సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యలతో పాటు రైతులు, యువజనులు, మహిళ, విద్యార్థి, వ్యవసాయ కార్మిక సమస్యలపై చారిత్రిక పోరాటాలు చేసి అపూర్వ విజయాలను సాధించిందన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్రలో తెలంగాణ, రైతాంగ సాయుధ పోరాటం సువర్ణక్షర లిఖితమని ఈ పోరాటంలో నాలుగున్నర వేల మంది అమరులయ్యారని సాయుధ పోరాటం తెలంగాణ సమాజంపై తీవ్ర ప్రభావం చూపించిందని ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి జన జీవితంలో గొప్ప మార్పు తెచ్చిందన్నారు. వందేళ్ల సుదీర్ఘ పోరాటాన్ని నేటి తరానికి తెలియజేయడంతో పాటు భవిష్యత్ పోరాటాలకు ప్రజలను కార్యోన్ముఖులను చేసేందుకు 2026 జనవరి 18న ఖమ్మంలో చారిత్రక సభ నిర్వహిస్తున్నట్లు హేమంతరావు తెలిపారు. జనవరి 18న సాయంత్రం నాలుగు గంటలకు ఖమ్మం డిగ్రీ కళాశాల మైదానంలో లక్షలాది మందితో బహిరంగ సభ నిర్వహించనున్నామని ఈ సభకు తెలంగాణ రాష్ట్రంతో పాటు దక్షిణాది రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలి రానున్నారని హేమంతరావు తెలిపారు. కేరళ, కర్ణాటక, తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల నుంచి ప్రత్యేక రైలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సభకు 40 దేశాల నుంచి సౌహార్థ సందేశం ఇచ్చేందుకు ప్రతినిధులు తరలిరానున్నారన్నారు. ఈ చారిత్రక సభను జయప్రదం చేసేందుకు జనవరి ఒకటి నుంచి విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు.

### జాతాలు.. జనరల్ బాడీ సమావేశాలు...

జనవరి 18న జరిగే బహిరంగ సభకు సంబంధించి జనవరి మూడు నుంచి ఆరవ తేదీ వరకు ప్రధాన గ్రామాలు, పార్టీ ప్రభావితం గల ప్రాంతాలలో జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించనున్నట్లు హేమంతరావు తెలిపారు. జనవరి మూడవ తేదీన శత వసంతాల ముగింపు వేడుకల సభ విజయవంతంలో భాగంగా వేంసూరు జాతా ప్రారంభమవుతుందని మూడు నుంచి ఏడు వరకు ఐదు రోజుల పాటు అన్ని మండలాల్లో జాతా నిర్వహించడం జరుగుతుందన్నారు. జనవరి తొమ్మిదిన జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ప్రభాతభేరి నిర్వహించనున్నామని 10న అన్ని మండల కేంద్రాల్లో బెలూన్లు ఎగరవేయడం జరుగుతుందని, 13 నుంచి 16వ తేదీ వరకు మైక్ ప్రచారం నిర్వహించనున్నామన్నారు. ఖమ్మం నగరంలో వారం రోజుల పాటు ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నామని హేమంతరావు తెలిపారు. ఈ సభలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఎస్‌కె జానిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, అజ్మీర రామ్మూర్తి పాల్గొన్నారు.

## కెసిఆర్‌పై వ్యక్తిగత దూషణలు సరికాదు

**ప్రజాపక్ష/జూలూరుపాడు:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డివి సోయిలేని మాటలు, సోయిలేని విమర్శలు అని వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు విమర్శించారు. ముఖ్యమంత్రి పూర్తిగా మాటలకే పరిమితమై, ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ఘోరంగా విఫలమయ్యారని దుయ్యబట్టారు. కొడంగల్ లో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను శుక్రవారం ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజల సహనం శాశ్వతం కాదని, సరైన సమయంలో రేవంత్ రెడ్డికి తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు.

# మరో వందేళ్లయినా ప్రజాక్షేత్రంలోనే..



**దేశంలో శతవసంతాలు పూర్తి చేసుకున్న ఏకైక పార్టీ సిపిఐ**
**- జనవరి 18న ఖమ్మంలో 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ**
**- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా**
**- జిల్లాలో ఘనంగా సిపిఐ శతవసంత వేడుక**
**- కొత్తగూడెం కేంద్రంలో భారీ ర్యాలీ, జెండా ఆవిష్కరణలు**





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఈ దేశంలో శత వసంతాలు పూర్తి చేసుకున్న ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) అని, తొలినాళ్ల నుండి ఇప్పటికీ, ఎప్పటికీ పేదలు, బడుగు, బలహీన వర్గాలు కోసం పోరాటాలు సాగిస్తుందని, రానున్న మరో వందేళ్లు కూడా ఇదే స్పూర్తితో ప్రజా క్షేత్రంలో మనగలమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. సిపిఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి కావడంతో జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో ఎర్రజెండాలు ఎగురవేసి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్, పోస్టాఫీస్ సెంటర్లో సాబీర్ పాషా అరుణ పతాకాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం జిల్లా కేంద్రంలో వేలాది మందితో భారీ ర్యాలీ జరిగింది. ఓల్డ్ డిపో సెంటర్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ సూపర్‌బజార్, బస్టాండ్ మీదుగా పోస్టాఫీస్ సెంటర్‌కు చేరుకుంది. ఆ సెంటర్లో ఉన్న డా.బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం హమీల వర్కర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎర్రజెండాను ఎగురవేశారు. అనంతరం పాషా మాట్లాడుతూ 1925లో కాన్పూరులో ఆవిర్భవించిన సిపిఐ నేటితో శంత వసంతాలు పూర్తి చేసుకుందన్నారు. భారతజాతీయ స్వతంత్రోధ్యమంలో సైతం తనదైన పాత్రపోషించి బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిందని, భరతమాతను బానిస సంకెళ్ల నుండి విముక్తి చేసేందుకు సిపిఐకి చెందిన ఎందరో యువ కిషోరాలు రక్తతర్పణం చేశారని, చెల్లా చెదురుగా ఉన్న ఆస్థానాలను భారతదేశంలో విలీనం చేసేందుకు అలుపెరగని పోరాటాలు చేసిందన్నారు. పెత్తందారీ, జమిందారీ విధానాలను రూపు మాపేందుకు కమ్యూనిస్టు పార్టీ చేసిన త్యాగాలు అజరామరమని అన్నారు. నాటి నుండి నేటి వరకు పేదలు, బడుగు, బలహీన వర్గాలకు అండగా ఎర్రజెండా నిలుస్తోందని, పీడత ప్రజల విముక్తి కోసం పుట్టుకొచ్చున్న సిపిఐ వారి పక్షాన నిరంతరం పోరాడుతోందని, లక్షలాది ఎకరాల భూములను పేదలకు పంచిందని తెలిపారు. అంతరాలు లేని సమాజమే సిపిఐ ధ్యేయమని, సంపదన కొందరి చేతుల్లో నిక్షిప్తమై ఉండటం కాదని, ఆ సంపద అందరికీ సమానంగా పంచబడాలనేదే సిపిఐ ఏకైక లక్ష్యమని, సమానత్వం, సమ సమాజ స్థాపనకు ఎంతటి త్యాగాలకైనా వెనకడుగు వేసేది లేదన్నారు. దేశంలో మతం పోకడలకు అడ్డుకట్ట వేసేందుకు సిపిఐ ముందుకు సాగుతుందని, మతం,కులం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయ లబ్ధిపొందేందుకు చూస్తున్న ఛాందసవాదులకు త్వరలోనే బుద్ధి చెబుతామన్నారు. పాలకులు ప్రజలకిచ్చిన హామీలను నిలుపుకోవాలని, లేదంటే ప్రజాగ్రహానికి గురుకాక తప్పదన్నారు. గడిచిన స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ ఒంటరి పోరాటం చేసి విజయతీరాలకు చేరిందని, సిపిఐని నిలువరించాలని ప్రయత్నించిన వారికి నిరాశే మిగిలిందని చెప్పారు. ఎర్రజెండా పనై పోయిందని కారుకూతలు కూసే వారికి గ్రామపంచాయితీ ఎన్నికల ఫలితాలు చెంపపెట్టని, సిపిఐని లేకుండా చేద్దామని చూసిన అనేక పార్టీలు కాల గర్భంలో కలిసిపోయాయని గుర్తుచేశారు. అధికారం,పదవులు ఉన్నా లేకున్నా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామని, ప్రజలను నమ్మించి మోసం చేసే పాలకులను నిలదీస్తామని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎంతటి ఉద్యమానికైనా, త్యాగానికైనా వెనుకాడబోమని చెప్పారు. జనవరి 18న ఖమ్మం కేంద్రంగా జరిగే సిపిఐ శతవసంత ఉత్సవాల ముగింపు సభ 5 లక్షల మందితో జరగనుందని, ఆ సభకు ప్రపంచ దేశాల నుండి అనేక మంది తరలివస్తున్నట్లు చెప్పారు. సభకు జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున ప్రజలను తరలించేందుకు నాయకులు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, దుర్గరాశి వెంకన్న, చంద్రగిరి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళీ, కందుల భాస్కర్, ఫయూమ్, వీరస్వామి, జిల్లా సమితి సభ్యులు భూక్యా శ్రీనివాస్, గెద్దాడ నగేష్, మునిగడప వెంకన్న, నెరేళ్ల రమేష్, పోలమూరి శ్రీను, రత్నకుమారి, నూతన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, మాజీ కౌన్సిలర్‌లు,ప్రజా ప్రతినిధులు, కార్యక ర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ చలిజ్వరం..!

**(మొదటిపేజీ తరువాయి)**

కొనసాగుతుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది.

### దారుణంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు..

రోజురోజుకు ఉష్ణోగ్రతలు పడిపోతుండటంతో జనం చలికి వణికిపోతున్నారు. మండల వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో చలి ప్రభావం జనజీవనంపై పడుతోంది. ఉదయం 9 గంటలు దాటినా ఇళ్ల లోంచి బయటకు రావడానికే జంకే పరిస్థితి ఏర్పడింది. మరో రెండు మూడు రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఉదయం 9 గంటల వరకు కూడా చలి తగ్గకపోవడం, సాయంత్రం 5 గంటల నుంచే చల్ల గాలులు వీస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం వేళ రహదారులను దట్టమైన పొగ మంచు కమ్మేస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో ఉష్ణోగ్రతలు మరింత తగ్గనున్నాయని వాతావరణ శాఖ పేర్కొంది. తెలంగాణ రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాలకూ ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. చలి నుంచి రక్షణకు ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ సూచించింది.

### చలి తీవ్రతో ముసురుతున్న రోగాలు...

సాధారణంగా మన శరీర ఉష్ణోగ్రతను మెదడులోని హైపోథాలమస్ గ్రంథి నియంత్రిస్తుంది. అయితే, బయట ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల కంటే తక్కువకు పడిపోతే శరీరంలోని ఉష్ణ నియంత్రణ వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి పడుతుంది. ప్రస్తుతం రాష్ట్రంలో పలుచోట్ల ఉష్ణోగ్రతలు 5 నుంచి 13 డిగ్రీల మధ్యే రికార్డవుతుండటంతో బాడీ మెకానిజం దెబ్బతినే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీనివల్ల రక్తనాళాలు కుంచించుకుపోయి బీపీ పెరగడం, తద్వారా గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

### బయటకు వెళ్ళేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి
### డాక్టర్ వెంకటేశ్వర్లు



బయటకు వెళ్లేటప్పుడు స్వెట్టర్లు, మఫ్లర్లు, గ్లౌజులు తప్పనిసరిగా ఉపయోగించాలని, ముఖ్యంగా ముక్కు, చెవుల ద్వారా చలి గాలి లోపలికి వెళ్లకుండా జాగ్రత్త పడాలని పేర్కొన్నారు. శ్వాసకోశ సమస్యలున్న వారు రోజుకు రెండు సార్లు ఆవిరి పడితే ఊపిరితిత్తులకు ఉపశమనం లభిస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. రోగ నిరోధక శక్తిని పెంచుకోవడానికి తాజా ఆకుకూరలు, పండ్లు, ప్రోటీన్లతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, ఆస్తమా రోగులు ఈ సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని, తెల్లవారుజామున, అర్థరాత్రి వేళల్లో ప్రయాణాలు మానుకోవడం ఉత్తమమని, చలి తీవ్రత పెరిగే కొద్దీ బ్యాక్టీరియా విజృంభణ కూడా పెరుగుతుంది కాబట్టి స్వల్ప లక్షణాలు కనిపించినా నిర్లక్ష్యం చేయవద్దని జూలూరుపాడు వైద్యఅధికారి వెంకటేశ్వర్లు సూచిస్తున్నారు.

# లెక్కలు చెప్పకపోతే చిక్కులే..!

**(మొదటిపేజీ తరువాయి)**

అభ్యర్థులు రూ. 50 వేల వరకు ఖర్చు చేయవచ్చు.

### 45 రోజుల్లో..

జిల్లాలో మూడు విడతల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఏకగ్రీవాలను మినహాయించి మిగిలిన స్థానాల్లో పోటీచేసిన వారంతా నామినేషన్ దాఖలుచేసిన రోజు నుంచి 45 రోజుల్లో ఖర్చుల వివరాలను సమర్పించాలి. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం వివరాలు ఇవ్వకుంటే గెలిచిన వారు పదవీ కోల్పోవడంతో పాటు మూడేళ్ల పాటు ఎన్నికల్లో పోటీకి అనర్హులవుతారు. ఓడిన అభ్యర్థులకు ఇదే నిబంధన వర్తిస్తుంది. ఉమ్మడి జిల్లాలోని 1037 గ్రామపంచాయతీలు, 9336 వార్డు స్థానాలు ఉండగా.. వాటికి మూడు విడతల్లో (డిసెంబరు 11, 14, 17 తేదీల్లో ) ఎన్నికలు జరిగాయి. ఈ లెక్కన తొలివిడత ఎన్నికలు జరిగిన అభ్యర్థులు 2026 జనవరి 24న, రెండో విడత వారు జనవరి 27న, మడో విడత ఎన్నికలు జరిగిన అభ్యర్థులు జనవరి 30న తమ ప్రచార ఖర్చులకు సంబంధించిన వివరాలను అధికారులకు సమర్పించాలి.

## కుర్సం ముత్యాల మరణం పార్టీకి తీరని లోటు



**ప్రజాపక్షం/ములకలపల్లి:** సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు కుర్సం ముత్యాలు శుక్రవారం తెల్లవారుజామున అనారోగ్య కారణంగాగ మృతి చెందారు. సిపిఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు కుర్సం ముత్యాలు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుర్సం ముత్యాలు సిపిఎం పార్టీ క్రమ శిక్షణ కట్టుబడి అనేక పోరాటాలలో పాల్గొన్నారని అన్నారు. ముత్యాలు వికలాంగుడైనప్పటికీ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. కుర్సం ముత్యాలు మరణం సిపిఎం పార్టీకి తీరని లోటని అన్నారు. ఈకార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు నిమ్మల మధు, గడ్డం వెంకటేశ్వర్లు, తేజావత్ జగ్గు, కోర్సా వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# చారిత్రాత్మకమైన పార్టీ సిపిఐ

**- ఖమ్మంలో జనవరి 18న శతాబ్ది ఉత్సవాలు**
**- సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** భారతదేశంలో 100సంవత్సరాల చరిత్ర కలిగిన ఏకైక రాజకీయ పార్టీ సిపిఐ అని జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. శుక్రవారం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని వంరగల్ క్రాస్‌రోడ్‌లోని డిబిఆర్ చౌరస్తాలో గల ఫైలాన్ వద్ద ఏర్పాటు చేసిన అరుణ పతాకాన్ని ఆయన ఆవిష్కరించి శతాబ్ది ఉత్సవాలను ప్రారంభించారు. తొలుత అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌ను మహిళా సంఘం జిల్లా నాయకులరాలు ఓరుగంటి ప్రమీల కట్ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో దండి మాట్లాడారు...రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో డిసెంబర్ 26న నిర్వహించాల్సిన శతాబ్ది ఉత్సవాలు వాయిదాపడ్డాయన్నారు. ఆ వేడుకలను జనవరి 18న ఖమ్మం నగరంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కావున ఊరు, వాడల నుంచి కుటుంబాలుగా తరలివెళ్లి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కమ్యూనిస్టు నేతలు తరలిరానున్నారని, 5లక్షల మందితో కన్నుల పండుగగా జరగనుందన్నారు. వందేళ్ల ఈ సుదీర్ఘకాలంలో సిపిఐ చేసిన పోరాటాలు, సాధించిన హక్కులు ప్రజలకు తెలియజేయాలన్నారు. అలాగే నేటి యువతారానికి సైతం సిపిఐ చరిత్రను వివరించాలన్నారు. ఇందుకోసం ప్రతి కామ్రేడ్ కంకణబద్ధులై ముమ్మర ప్రచారం చేయాలని సూచించారు. అనంతరం ఓరుగంటి శేషగిరిప్రమీల దంపతులు వేడుకలకు విరాళంగా అందించనున్న నగదను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు వెంపటి సురేందర్, చెరుకుపల్లి భాస్కర్, సిపిఐ శాఖ, డివిజన్ సెక్రటరీలు గూడా బాబు రెడ్డి, కొనకటి కృష్ణారెడ్డి, ధరావత్ కృష్ణ, దొంతగాని వెంకన్న, మేళ్లచెర్వు రవి, వెంపటి రాము, లగిశెట్టి రమేష్, యువజన సంఘం నాయకులు ఘనపారపు ఉపేందర్, మిరయాల నరుణ్‌తేజ్, కిరణ్ పాల్గొన్నారు.

## ప్రజలు మెచ్చేలా పల్లెపాలన : బాగం

**-సిపిఐ సర్పంచ్‌లకు ఘన సన్మానం**




**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రజలు మెచ్చేలా పల్లె పాలన ఉండాలని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సిపిఐ ప్రజా ప్రతినిధులు పని చేయాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు కోరారు. సిపిఐ పక్షాన గెలిచిన గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లను శుక్రవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ తమ, పర బేధం లేకుండా అన్ని వర్గాల ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. గ్రామాల అభివృద్ధితో పాటు పల్లెల్లో ప్రశాంతతను కాపాడాలని, గ్రామానికి కమ్యూనిస్టు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, మండల కార్యదర్శులు, ఆయా గ్రామాల పార్టీ నాయకులు తదితరులు హాజరయ్యారు.

## సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను జయప్రదం చేయండి

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు**



**ప్రజాపక్షం/చింతకాని :** జనవరి 18న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ కు చింతకాని మండల వ్యాప్తంగా విరివిగా ప్రజలు హాజరై విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు పిలుపునిచ్చారు. సిపిఐ నూరు వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం చింతకాని మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నాగిలిగొండ సర్పంచ్ ఏపూరి పద్మ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రవీంద్రబాబు మాట్లాడుతూ భారతదేశ గడ్డపై సిపిఐకి వందేండ్లన్నారు. దీనికి గుర్తుగా శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను నిర్వహిస్తున్నామని తెలిపారు.వందేండ్ల మహా ప్రస్థానంలో నిత్యం ప్రజాసమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు నిర్వహించిన చరిత్ర సిపిఐ సొంతమన్నారు.ఏ పార్టీకి లేని ఘన చరిత్ర సిపిఐ కి ఉందన్నారు. భూస్వాముల చెరనుండి లక్షలాది ఎకరాల భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచిపెట్టిన ఘన చరితను లిఖించుకున్న సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు చింతకాని మండలం నుంచి అన్ని వర్గాల ప్రజలు అదిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండలం నుండి పురుషులు రెడ్ షర్ట్స్, మహిళలు చీరలతో, డప్పు కోలాట నృత్యాలతో భారీగా ఖమ్మం తరలిరావాలన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పావులూరి మల్లిఖార్జునరావు, కూచిపుడి రవి ,మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, సహాయ కార్యదర్శి అబ్బూరి మహేష్, నాగిలిగొండ సర్పంచ్ ఏపూరి పద్మ, మండల కమిటీ సభ్యులు తాళ్లూరి యాదగిరి, గోగుల ఆది, షేక్ దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

## జనసేవదళ్ కవాతుకై స్థల పరిశీలన



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీ వరంగల్‌క్రాస్ రోడ్‌లో ఆదివారం నిర్వహించనున్న మూడవ దశ జనసేవాదళ్ కవాతుకై ఏర్పాటు చేసిన స్థలాన్ని అక్కడి సిపిఐ నాయకులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కవాతు తొక్కే ప్రదేశంలో ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల చర్చించారు. అలాగే సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, పలు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యుడు వెంపటి సురేందర్, 28,29 డివిజన్‌ల సెక్రటరీలు వెంపటి రాము, లగిశెట్టి రమేష్, 29వ డివిజన్ ఏఐవైఎఫ్ సెక్రటరీ మిరియాల నరుణ్‌తేజ్, మున్సిపాలిటీ నాయకులు అక్కిపల్లి కర్ణచారి, బూరెల రాము తదితరులు పాల్గొన్నారు.

## జనవరి 18న ఖమ్మం నగరానికి దండుగా కదులుదాం

**- సిపిఐ శతాబ్ది ఉత్సవాలను ప్రజల పండగుగా మార్చాలి**
**- సిపిఐ వందేళ్ల ఆవిర్భావ దినోత్స పతాకాన్ని ఆవిష్కరణ**




**ప్రజాపక్షం/ మధిర :** కమ్యూనిజం అజరామారం అని, మనిషి మనుగడ ఉన్నంత వరకు కమ్యూనిస్టులు ఉంటారని ఈ వందేళ్లపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి భారత కమ్యూనిస్టు పార్టీ( సిపిఐ) అనేక పోరాటాలు, త్యాగాలు చేసిందని, రాబోయే వందేళ్లు కూడా అనునిత్యం ప్రజాక్షేత్రంలోనే ఉంటామని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు అన్నారు. శుక్రవారం మదుపల్లి సిపిఐ కార్యాలయంలో సిపిఐ వందేళ్ల ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా వందేళ్ల అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సిపిఐ మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు అధ్యక్షతన జరిగిన సభలో బెజవాడ రవిబాబు మాట్లాడుతూ సిపిఐ వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జనవరి 18న ఖమ్మం నగరంలో జరిగే శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగ సభకు ప్రతి పల్లె, పట్టణం నుంచి దండుగా కదలాలని, అందు కోసం పార్టీ శ్రేణులు నిరంతరం శ్రమించాలన్నారు. సిపిఐ శతాబ్ధి ఉత్సవాలు కేవలం పార్టీ వేడుకలుగా కాకుండా ప్రజల ఉద్యమ చరిత్రను గుర్తు చేసే సమయంగా ఉండాలని, అందుకు పార్టీ శ్రేణులు సిపిఐ శతాబ్ధి ఉత్సవాలను ప్రజల పండుగగా మార్చాలని రవిబాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు పెరుమాళ్ళపల్లి ప్రకాశ్‌రావు, జల్లా బ్రహ్మం, పంగా శేషగిరిరావు, అన్నవరపు సత్యనారాయణ, ఊట్ల కామేశ్వరరావు, పున్నవల్లి అప్పారావు, నర్సింహారావు, మదుపల్లి సిపిఐ గ్రామశాఖ నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల నేతలు తదితరుల పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ న్యాయవాదులుగా దేవరపల్లి, పల్లపోతు నియామకం




**ప్రజాపక్షం/ మధిర :** ఖమ్మం జిల్లా మధిర పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాదులు దేవరపల్లి సుబ్రహ్మణ్యం, పల్లపోతు కృష్ణారావులను కేంద్ర ప్రభుత్వ అడిషనల్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పదవిలో మూడు సంవత్సరాల పాటు కొనసాగుతారు. సీనియర్ న్యాయవాదులు దేవరపల్లి సుబ్రహ్మణ్యం, పల్లపోతు కృష్ణారావులకు కేంద్ర ప్రభుత్వం న్యాయవాదులుగా నియామకం కావడం పట్ల పలు రాజకీయ పార్టీనేతలు, అధికారులు, న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు.

## కాలి నడకన శ్రీశైలానికి..

**-ఐదవ సారి కృష్ణమోహన్ పాదయాత్ర**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజలంతా బాగుండాలి, గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ గత ఐదేండ్లుగా శ్రీశైలంలోని మల్లికార్జున స్వామిని కాలి నడకన వెళ్లి ఇరుముడి చెల్లించి మొక్కులు చెల్లించుకుంటున్నాడు ఓ భక్తుడు. వివరాల్లోకి వెళితే... రఘునాథపాలెం మండలం వి. వెంకటాయపాలెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వెంపటి కృష్ణమోహన్‌రావు శివ భక్తుడు. గత కొన్నేళ్లుగా ప్రతి ఏడాది శివమాల ధరించి శ్రీశైలంలోని మల్లికార్జున స్వామిని దర్శించుకునేవాడు. గత ఐదేండ్లుగా శివమాల ధరించి ఇరుముడి కట్టుకుని శ్రీశైలానికి కాలి నడకన పాదయాత్ర చేసుకుంటూ వెళ్తున్నాడు. సుమారు 350 కిలో మీటర్లు నడుచుకుంటూ శ్రీశైలం వెళ్లి మల్లికార్జున స్వామికి మొక్కులు చెల్లించుకుంటున్నాడు. ఈ ఏడాది శివమాల ధరించిన కృష్ణమోహన్‌రావు గురువారం గ్రామంలోని గంగమ్మ గుడి వద్ద ఇరుముడి ధరించి శ్రీశైలం వెళ్లేందుకు పాదయాత్ర ప్రారంభించాడు. ఈ సందర్భంగా కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, గ్రామం అభివృద్ధి చెందాలన్నదే తన అభిమతమని తెలిపారు. 10 రోజులు పాటు కాలి నడకన పాదయాత్ర చేసుకుంటూ శ్రీశైలంకు వెళ్లి ఇరుముడిని స్వామి వారికి సమర్పించి మొక్కులు చెల్లించుకుంటానని తెలిపారు.

## గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** సాగర్‌కాల్వలో ఈతకు దిగి గల్లంతైన విద్యార్థి యడ్ల శశాంక్ మృతదేహాన్ని గురువారం పోలీసులు గుర్తించారు. బుధవారం ఖమ్మం వికలాంగుల కాలనీ సుల్తాన్‌నగర్‌కు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థి ఎండి అబ్దుల్‌సుహాన్, యడ్ల శశాంక్, ఈశ్వర్లు ఈతకు సమీప సాగర్‌కాల్వకు వెళ్లగా సుహాన్, శశాంక్ నీటిలో దిగి ఈతకొడుతుండగా ప్రవాహంలో గల్లంతైయ్యారు. సుహాన్ మృతదేహం సమీపంలో లభించగా శశాంక్ ఆచూకి లభించలేదు. గాలింపుల చేపట్టిన పోలీసులకు గురువారం కొణిజర్ల లోని సాగర్‌కాల్వ డిప్‌కట్ వద్ద ప్రవాహంలో కొట్టుకువచ్చిన మృతదేహాన్ని స్థానికులు గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు పరిశీలించి చూడగా గల్లంతైన విద్యార్థి శంశాంక్‌గా గుర్తించి ఖమ్మం టూటౌన్ పోలీసులకు సమాచారం అందించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తల్లితండ్రులకు సమాచారం ఇచ్చి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. ఇద్దరు విద్యార్థుల మృతితో వారి కుటుంబాలతో పాటు తోటి స్నేహితులు రోదనలతో కాలనీలో విషదచాయలు అలముకున్నాయి.

## మున్నేరులో బాలిక మృతదేహం లభ్యం

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** నగరంలోని ప్రకాశ్‌నగర్ మున్నీరు లో శుక్రవారం బాలిక మృతదేహం లభ్యమైంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం రూరల్ మండలం పరిధిలోని ఇటుక బట్టిలో పనిచేసే ఒడిశా రాష్ట్రానికి చెందిన వలసకూలి జమామి(17) గా పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిచారు. ఆత్మహత్య లేక ప్రమాదవశాత్తు మున్నేరులో పడి మృతిచెందిదా అనే కోణంలో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఫుట్‌బాల్ క్రీడాకారిణి కిరణ్మయికి ఆర్థిక చేయూత





**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** అండర్ 19 ఫుట్‌బాల్ జాతీయ జట్టుకు ఎంపికైన మరికంటి కిరణ్మయికి కాంగ్రెస్ నాయకులు ఆర్థిక చేయూతనందించారు.మండల పరిధిలోని వి.వెంకటాయపాలెం గ్రామానికి చెందిన మరికంటి కిరణ్మయి జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. మణిపూర్ రాష్ట్రంలో జనవరిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో కిరణ్మయి పాల్గొననుంది. మణిపూర్ వెళ్లేందుకు అవసరమైన ప్రయాణ ఖర్చుల కోసం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు రూ. 22వేల ఆర్థిక సహాయాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కాపా ఆదినారాయణ మాట్లాడుతూ గ్రామానికి చెందిన కిరణ్మయి ఫుట్‌బాల్‌లో ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. జాతీయ స్థాయిలో రాణించి గ్రామానికి, జిల్లాకు పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కిరణ్మయిని పలువురు అభినందించారు.

**క్రీడాకారులకు ఫుట్‌బాల్ కిట్లు పంపిణీ..**

వి.వెంకటాయపాలెం గ్రామంలోని పాఠశాల ఫుట్‌బాటు క్రీడాకారులకు పుల్లఖండ పురుషోత్తం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫుట్‌బాల్ కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. మొత్తం 22 మంది క్రీడాకారులకు ఈ కిట్లను అందజేశారు. ఫుట్‌బాల్ కిట్లను అందించిన ట్రస్టు నిర్వాహకులకు క్రీడాకారులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ నిర్వాహకులు అన్నం శ్రీనివాసరావు, పుల్లఖండ సత్యనారాయణ మూర్తి, మైలవరపు నాగేశ్వరరావు, ఫుట్‌బాల్ కోచ్ కళ్యాణపు ఆదర్శ్, కాంగ్రెస్ నాయకులు కిలారు వెంకట రమణ, బానోత్ కిషోర్, జంగాల శ్రీనివాస్, పరిటాల ముత్తయ్య, మూడు శంకర్, సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారులు సాయిరాం, గోపిచంద్, వీరబాబు, కోటి తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కోసం రైతుల ఇబ్బందులు





**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** వ్యవసాయ సాగు అవసరాలకు అనుగుణంగా యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో రైతులు మొక్కజొన్న, కూరగాయలు ఇతరత్రా పంటలను అధికంగా సాగు చేస్తుండడంతో రైతులు యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారు. సహకార సంఘాలకు వచ్చిన కొద్దిపాటి యూరియాను రైతులకు అందిస్తున్నప్పటికీ సరిపోవడం లేదని రైతులు వాపోతున్నారు. శుక్రవారం మండలంలోని వి. వెంకటాయపాలెం, రఘునాథపాలెం, మంచుకొండ సొసైటీల ద్వారా యూరియా పంపిణీ చేపట్టారు. వ్యవసాయ శాఖాధికారులు కూపన్లు జారీ చేసిన రైతులకు సొసైటీల వద్ద రెండు బస్తాల చొప్పున యూరియాను పంపిణీ చేశారు. మంచుకొండ సొసైటీ పరిధిలో ఎక్కువ గ్రామాలు, రైతులు ఉండడంతో సొసైటీకి వచ్చిన 445 యూరియా బస్తాలు సరిపోక రైతులు ఇబ్బందులు పడ్డారు. రైతులకు ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి ఉమమహేశ్వరరెడ్డి తెలిపారు. యూరియా అందని రైతులకు రఘునాథపాలెం సొసైటీ, ఈర్లపుడి సెంటర్‌లో పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు.

# ఘనంగా సిపిఐ ఆవిర్భావ దినోత్సవం

**పార్టీ కార్యాలయానికి విద్యుత్ దీపాలతో ముస్తాబు**





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆవిర్బావ దినోత్సవాన్ని సిపిఐ ఖానాపురం హవేలీ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పార్టీ ఆవిర్బావ దినోత్సవం సందర్భంగా హవేలీ కార్యదర్శి ఏనుగు గాంధీ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ వేడుకలకు హాజరైన సిపిఐ ఖమ్మం నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి శత వసంతాలు పూర్తయ్యాయన్నారు. సిపిఐ ప్రజల పక్షాన పోరాటాలు సాగించిందన్నారు. శత వసంతాలు పూర్తయిన సందర్భంగా ఖమ్మంలో జనవరి 18న జరిగే ముగింపు సభను జయప్రదం చేయాలని కోరారు. శత వసంతాల సందర్భంగా హవేలీ కార్యదర్శి ఏనుగు గాంధీ ఆధ్వర్యంలో సిపిఐ కానాపురం హవేలీ పార్టీ కార్యాలయానికి రంగులు వేయించి విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ, జాకీర్, అముదాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# వైరాలో గాయత్రి బ్యాంక్ ప్రారంభం





**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపలిటీలో నూతనంగా నిర్మించబడిన గాయత్రి బ్యాంక్ సేవలు గాయత్రి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ సేవలు పారదర్శకంగా విస్తరించనున్నట్లు గాయత్రి బ్యాంక్ సీఈవో వనమాల శ్రీనివాస్, వైరా మురళీకృష్ణ హాస్పిటల్ అధినేత డాక్టర్ కాపా మురళీ కృష్ణ, అయ్యప్ప దేవస్థానం చైర్మన్ కొప్పురావూరి వెంకటకృష్ణ, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు వనమా విశ్వేశ్వరరావు తెలిపారు. వైరాలో ది గాయత్రి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంవ 70వ శాఖను వారు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2000 సంవత్సరంలో ప్రారంభించబడిన బ్యాంకు ప్రస్తుతం మల్టీస్టేట్ బ్యాంకుగా రూ.3870 కోట్ల వ్యాపారాన్ని సాధించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలవ్యాప్తంగా 69 బ్రాంచీలతో రోజురోజుకి అభివృద్ధి చెందుతుందన్నారు. వైరా ప్రజలందరూ బ్యాంకు సేవలను వినియోగించుకొని బ్యాంకు అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు రీజనల్ హెడ్ కోటా శ్రీనివాసులు, బ్రాంచ్ హెడ్ షేక్ రహీముతుల్లా, బ్యాంక్ సిబ్బంది, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# పాదయాత్రతో షిరిడిసాయి మహారాష్ట్రకు భక్తులు



**ప్రజాపక్షం/పెనుబల్లి:** షిరిడిసాయి భక్తులు షిరిడికి పాదయాత్ర చేపట్టారు. ఏపీ రాష్ట్రం ఏలూరు జిల్లా పెదవేగి మండలం లక్ష్మీపురం గార్డెన్ చెందిన సుమారు 50 మందికి పైగా షిరిడి సాయి బాబా భక్తులు పాదయాత్రతో షిరిడి సాయినాథ సన్నిధికి బయలుదేరారు. సాయి పల్లకి మోస్తూ ఈ నెల 20వ తేదీ లక్ష్మీపురం గార్డెన్ నుండి 1050 కిలో మీటర్లు 45 రోజులు పాదయాత్రతో బయలుదేరి శుక్రవారం పెనుబల్లి మండలం వీఎం బంజర్ గ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా పెనుబల్లి మండల సాయి భక్తులు వారికి స్వాగతం వారితో పాటు గ్రామ శివారు వరకు పాదయాత్ర చేపట్టి వీడ్కోలు పలికారు.

# ఘనంగా వంగవీటి మోహన్‌రంగా వర్ధంతి



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలం రామచంద్రపురం గ్రామంలో వంగవీటి మోహన్‌రంగా 37వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేశారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు గోపిశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వంగవీటి మోహన్ రంగా ప్రజల కోసం చేసిన ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎర్రి నర్సింహారావు, గోవింద శ్రీను, మల్లారం సర్పంచ్ కటిక కిరణ్, దుగ్గిదేవర కళ్యాణి, నాగ నర్సింహారావు, సాదం రమేష్, ఉపసర్పంచ్ పసుపులేటి రామకృష్ణ, వార్డు సభ్యుడు రాధాకృష్ణ, లక్ష్మణ్, కోసూరు వేలాద్రి, పగడాల వెంకటేశ్వరరావు, సుంకర నాగేశ్వరరావు, కట్టా రామారావు పాల్గొన్నారు.

# తెలంగాణ గోల్డ్ కప్ టోర్నమెంట్‌కి కాంపల్లి



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండల పరిధిలోని నారాయణపురం గ్రామానికి చెందిన సూర్యప్రకాశ్ తెలంగాణ క్రికెట్ అసోసియేషన్(టిసిఎ) వారు నిర్వహించే తెలంగాణ గోల్డ్ కప్ టోర్నమెంట్‌కి ఖమ్మం జిల్లా జట్టు తరుపున ఎంపికయ్యాడు. వరంగల్‌లో కాకతీయ యూనివర్శిటీ గ్రౌండ్‌లో ఈ నెల 27 నుండి 29 తేదీ వరకు జరిగే టోర్నమెంట్‌లో ఆడునున్నాడు. జిల్లా జట్టుకు ఎంపిక కావటం పట్ల నారాయణపురం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చిన్ననాటి నుండి ఆటల్లో రాణిస్తూ అంచెలంచెలుగా ఎదిగి జిల్లా జట్టుకు ఎంపిక కావడం హర్షణీయమని అన్నారు. నారాయణపురం గ్రామస్తులతో పాటు తల్లాడ మండల నాయకులు సూర్యప్రకాశ్‌కు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపి క్రికెట్‌లో రాణించాలని ఆకాంక్షించారు.

# అజనాపురంలో క్రికెట్ టోర్నమెంట్

**ప్రజాపక్షం/ తల్లాడ :** క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలతో తల్లాడ మండలం అంజనాపురం గ్రామంలో అభయ ఆంజనేయస్వామి ఆశీస్సులతో క్రికెట్ టోర్నమెంట్ 2026 నిర్వహించనున్నట్లు శుక్రవారం అంజనాపురం క్రికెట్ కమిటీ సభ్యులు తెలిపారు. 2026 జనవరి 6వ తేదీ నుండి 12 తేదీ వరకు ఖమ్మం, భద్రాద్రి, కొత్తగూడెం, ఎపి రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా ఈ మూడు జిల్లాల స్థాయిలో టోర్నమెంట్ నిర్వహించనున్నట్ల తెలిపారు. దాతల సహకారంతో ప్రథమ బహుమతి రూ.25వేలు, ద్వితీయ బహుమతి రూ.20వేలు, తృతీయ బహుమతి రూ.15వేలు అందిస్తున్నట్లు కమిటీ వారు తెలిపారు. అదేవిధంగా కన్సోలేషన్ బహుమతులు అందిస్తామని, ఎంట్రీ ఫీజు రూ.1000 అని, రిజిస్ట్రేషన్ ఆఖరి తేదీ జనవరి 5 2026తేదీన ముగిస్తుందని, పూర్తి వివరాలకు 9652391304, 9652130915 కు సంప్రదించాలని కోరారు.

# క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న బొర్రా రాజశేఖర్



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ 14వ వార్డు ఇందిరానగర్ కాలనీలో జరిగిన ఇక్రస్మస్ వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర మాజీ మార్క్‌ఫెడ్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ క్రీస్తు జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొర్రా రాజశేఖర్ మాట్లాడుతూ మానవ పాపాల కొరకు ఈ లోకానికి వచ్చి సిలువలో మనకొరకు రక్తం చిందించిన ఆ కరుణామయుడి జయంతి ప్రపంచ దేశాల్లో జరుపుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో పమ్మి దాసు, మోదుగు లక్ష్మయ్య, పమ్మి రాజు, ఆదూరి ప్రేమ్‌కుమార్, కుక్కల నాగభూషణం, పమ్మి అర్జున్, పిడియాల నరేష్, మోదుగు సురేష్, కాకటి నర్సింహారావు, కరిష వాసు, కాకటి వినోద్, మోదుగు సురేష్, చాట్ల దానియేలు, దేవరపల్లి కాంతారావు, మోదుగు నాగబాబు, పమ్మి సతీష్, మోదుగు కృష్ణ, ఇందిరానగర్ యూత్, మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఎస్సై రామారావును మర్యాదపూర్వకంగా కలిసిన సర్పంచ్ శీలంచంద్రశేఖర్‌రెడ్డి



**ప్రజాపక్షం/వైరా:** వైరా ఎస్సై పుప్పాల రామారావును శుక్రవారం వైరా మండలం నారపునేనిపల్లి నూతన సర్పంచ్ శీలం చంద్రశేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై రామారావు నూతన సర్పంచ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైరా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బోళ్ళ గంగారావు, పమ్మి అశోక్, వీరంశెట్టి సీతారాములు పాల్గొన్నారు.

# పేదోడికి అండ ఎర్రజెండా

- త్యాగాలతో పునీతమైన సిపిఐ చరిత్ర
- వందేండ్లుగా జనం గుండెల్లో పదిలం
- ప్రజా ఉద్యమాలే సిపిఐ ఆయుధాలు






**ప్రజాపక్షం/పాల్వంచ :** పేదోడికి అండా ఎర్రజెండా అని, భూమి కోసం, భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడింది కేవలం భారతకమ్యూనిస్టు పార్టీనే అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం అన్నారు. సిపిఐ శతవసంతాల ఆవిర్భావ వార్షికోత్సవాల ముగింపు వేడుకలను పాల్వంచ పట్టణంలోని సిపిఐ కార్యాలయం చంద్రా రాజేశ్వరరావు భవన్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా కార్యాలయం ఎదుట అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. పట్టణం నుండి పాండురంగాపురం వరకు దిచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామ ప్రధాన కూడలిలో నిర్మించిన 100 సంవత్సరాల పైలాన్‌ను, అరుణ పతాకాలను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ముత్యాల విశ్వనాధం మాట్లాడుతూ స్వాతంత్ర సంగ్రామంలో దేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలన్నది కమ్యూనిస్టు పార్టీనే స్పష్టం చేశారు.కార్మిక, కర్షక, ప్రజల హక్కుల కోసం రాజీలేని పోరాటాలు చేసే సత్తా కమ్యూనిస్టులకే ఉందన్నారు.వందేండ్ల చరిత్ర కలిగిన పార్టీలో సభ్యత్వం కలిగి ఉండటం గర్వకారణమన్నారు. కమ్యూనిస్టులు ఎక్కడ అని అడిగే వారికి జనవరి 18వ, తేదీన ఖమ్మం పట్టంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ కనువిప్పుకావాలన్నారు. కార్మికులు, కర్షకులు, అన్ని వర్గాల ప్రజలు ఇంటింటికి స్వచ్ఛందంగా కదిలివచ్చి సభను జయప్రదం చేయాలన్నారు.అమరుల ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను అరకొరగా అమలు చేస్తు చేతులు దులుపుకొంటున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సంపూర్ణంగా అమలు చేయాలని, లేనిచో ప్రజలను సమీకరించి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబ, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు,ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు వరక అజిత్, బండి నాగేశ్వరరావు, గుండాల నాగరాజు, వీ. పద్మజ, వీసంశెట్టి విశ్వేశ్వర్‌రావు, సుధాకర్, అన్నవరపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, సిపిఐ ప్రజా సంఘాల నాయకులు శనగారపు శ్రీనివాసరావు, డి. చెన్నయ్య, నరహరి నాగేశ్వరరావు, ఐఏఎల్ రాష్ట్ర కార్యదర్శి ఉప్పుశెట్టి సునీల్, మన్నెం వెంకన్న, కోరె క్రిష్ణ, కాసర్ల రామారావు, వల్లపు యాకయ్య, వేములపల్లి రాజశేఖర్, గుండాల సుజన్, జకరయ్య, బిక్కులాల్, కొంగర అప్పారావు, వైఎస్ గిరి, గంగపురి వెంకన్న, వగ్గెల పద్మ, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, కుర్రు రమేష్, చంచలపురి శ్రీను, కొమురయ్య, మోహన్, శ్రీను, లాల్‌సింగ్, బాలాజి, చిల్ల క్రిష్ణ, బుచ్చయ్య, పెద్ద వెంకటరామయ్య, తిరుపతయ్య, బానోత్ రంజిత్, ఎస్‌కే కాసీం, నిట్ట అమృతరావు, ఎల్. చందూలాల్, తెజావత్ విజయ్ కుమార్, భూక్యా రమేష్, సురేష్, రమేష్, మాలోత్ హరి, శ్రీను, రమేష్, క్రిష్ణ, అల్లి వెంకటేశ్వర్లు, జరుపుల మోహన్,వీరు, సిపిఐ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సిపిఐ ఆవిర్భావ దినోత్సవం

- మణుగూరు పట్టణంలో సిపిఐ బైక్ ర్యాలీ
- జనవరి 18న బహిరంగ సభను విజయవంతం చేయండి
- సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి





**ప్రజాపక్షం/మణుగూరు:** పేద ప్రజలు బ్రతికున్నంత వరకు వారికి అండగా సిపిఐ పార్టీ పోరాటం కొనసాగిస్తూనే ఉంటుందని, వారికి అండగా సిపిఐ నిలుస్తుందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి అన్నారు. శుక్రవారం సిపిఐ పార్టీ 101 వ ఆవిర్భావ దినోత్సవం మణుగూరు మున్సిపాలిటీ, మండలంలో ఘనంగా నిర్వహించారు. గ్రామాలలో సిపిఐ జెండాలను ఎగరవేసుకొని మణుగూరు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మొత్తం మండలం మున్సిపాలిటీలో 49 చోట్ల సిపిఐ జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.1925 డిసెంబర్ 26న ఉత్తరప్రదేశ్ నగరంలో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావం జరిగిందని ఆనాటి నుండి నేటి వరకు దేశ స్వాతంత్రం కోసం అణగారిన పేద ప్రజల అభ్యున్నతి కోసం దున్నేవానికి భూమి కావాలని నినాదంతో కూలి రేట్లు పెంచాలని భూసంస్కరణలు తీసుకురావాలని నినాదంతో కమ్యూనిస్టు పార్టీ అనేక పోరాటాల నిర్వహించిందని ప్రత్యేక రాష్ట్ర యువజన కోసం అలుపెరగని పోరాటాలు కొనసాగించిందన్నారు. సిపిఐ పార్టీ 100 సంవత్సరాల ముగింపు వేడుకలు జనవరి 18 తారీకు వాయిదా వేయడం జరిగిందని జనవరి 18వ తేదీన ఖమ్మం నగరంలో ఐదు లక్షల మందితో పెద్ద ఎత్తున మీటింగ్ నిర్వహించనున్నామని దీనికి గ్రామ గ్రామాన ప్రతి ఒక్కరు జన సమీకరణ తరలించి సభను విజయవంతంగా కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. లక్ష్మి నారాయణ, మణుగూరు మండల కార్యదర్శి జక్కుల రాజబాబు ,పట్టణ కార్యదర్శి దుర్గాల సుధాకర్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్. బ్రాంచ్ కార్యదర్శి వై రామ్ గోపాల్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు జంగం మోహన్ రావు ఎడారి రమేష్, ఏఐటీయూసీ మణుగూరు మండల అధ్యక్షులు రాయల భిక్షం, కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు, కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, మహిళా సమైక్య మణుగూరు మండల అధ్యక్షురాలు బోలగాని సమ్మక్క, నాయకులు కొడిమెల్ల సుజాత , దుబ్బాక ప్రమీల, సాంబాయిగూడెం సర్పంచ్ చీడం ఉషారాణి, ఉప సర్పంచ్ పులిగిల్ల రమేష్, రామంజవరం మాజీ సర్పంచ్ బాడిశ సతీష్, సమితిసింగారం వార్డు మెంబర్లు వజ్రా వెంకటేశ్వర్లు, వేర్పుల నరేష్, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి తోట రమేష్ రైతు సంఘం జిల్లా నాయకులు మంగి వీరయ్య, ఎస్ కే సర్వర్, మంద కోటేశ్వరరావు, అదెర్ల రాములు, కన్నెబోయిన ప్రసాద్, శ్రీకాకుళం వీరమల్లు, కోల్ ట్రాన్స్పోర్ట్ అసోసియేషన్ అధ్యక్షులు ముసునూరి చందరరావు, కమతాల కోటయ్య, సాంబయ్య గూడెం వార్డు మెంబర్లు, తేనీటి నారాయణ, ఏఐటీయూసీ నాయకులు సాయి ప్రకాశ్, దాటల సందీప్, యాకూబ్, లింగస్వామి, ఆఫీస్ బేరర్స్, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గురుకుల ప్రవేశ పరీక్ష పుస్తకాలు అందజేత



**ప్రజాపక్షం/మణుగూరు:** తెలంగాణ గురుకులాల్లో ప్రవేశ పరీక్షలకు సిద్ధం అవుతున్న పగిడేరు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు జై భీమ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ తరుపున శుక్రవారం శాంతి నగర్ విష్డమ్ స్టడీ సెంటర్ లో అందజేసినట్లు ట్రస్ట్ నిర్వాహకులు బూర్గుల కరుణాకర్ భీమ్ ఒక ప్రకటనలో తెలిపారు. జై భీమ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ తరుపున పగిడేరు శాంతి నగర్ లో విష్డమ్ స్టడీ సెంటర్ ను ప్రారంభించి నర్సరీ నుండి 10 వ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు ఉచిత ట్యూషన్ ఏర్పాటు చేసి గురుకులం, నవోదయ, సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ గైడెన్స్ (కోచింగ్) ఇస్తున్నట్లు తెలిపారు ఈ మహోన్నతమైన కార్యక్రమాన్ని త్వరలోనే భద్రాద్రి జిల్లాలోని అన్నీ గ్రామాల్లో ప్రారంభిచనున్నట్లు తెలిపారు. గ్రామంలో పుట్టి, పెరిగి ఉన్నత స్థానాల్లో స్థిరపడిన గ్రామ పౌరులను సంప్రదించి "గో బ్యాక్ టూ విలేజ్ పే బ్యాక్ టూ సొసైటీ" అనే కాన్సెప్ట్ తో విద్యావంతుల టైమ్, టాలెంట్, ట్రెజర్ ను సేకరించి ఏ గ్రామానికి ఆ గ్రామంలో ఉచిత ట్యూషన్స్ నడపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుకులం ఎంట్రన్స్ బుక్స్ వేర్పుల వెంకటేశ్వర్లు, గైడ్ టీచర్ గులగట్టు రోజా, గ్రామస్తులు బూర్గుల కమలమ్మ, గులగట్టు అరవింద్, బి వి కె మౌర్య, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# మండలంలో మంత్రి తుమ్మల పర్యటన

## గంగారంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్న మంత్రి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సత్తుపల్లి మండలంలో పర్యటించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు సత్తుపల్లి మండల పరిధిలోని గంగారం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొననున్నట్లు మంత్రి కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మలతో పాటు సత్తుపల్లి శాసనసభ్యులు రాగమయి, రాష్ట్ర నాయకుడు దయానంద్ పాల్గొననున్నారు.

# పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేత



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండల కమ్మ మహాజన సేవా సంఘం లోని పేద విద్యార్థులు ముగ్గురికి తెలంగాణ రాష్ట్ర కమ్మ సేవా సంఘాల సమాఖ్య సహకారంతో స్కాలర్ షిప్ ఒక్కొక్కరికి 10 వేల రూపాయల చెక్కులను కమి టీ సభ్యులు అందజేశారు. ఈ సందర్భముగా కమిటి గౌరవ సలహాదారులు పుచ్చకాయల శంకర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కమ్మ వారి సేవా సంఘాల సమాఖ్య వారు ప్రతి సంవత్సరం రాష్ట్రంలోని ప్రతి కమ్మ సంఘంలో ముగ్గురు విద్యార్థులకు ఆర్థిక చేయూత ఇస్తున్నందుకు మణుగూరు కమ్మ మహాజన సేవా సంఘం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి సహాయాన్ని అయిన చేయుటకు కమిటీ సభ్యులు కృషి చేయడం అభినందనీయం అని తెలిపారు. కరాటి పోటీలలో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం తో రజత పథకం సాధించిన కమ్మ సామాజిక వర్గానికి చెందిన గుర్రం నివేదిత్ సాయిని శాలువతో సత్కరించారు. సంఘం అధ్యక్షులు ఉప్పలపాటి వెంకట రాంబాబు మాట్లాడుతూ ప్రతిభ కనపరిచే విద్యార్థులకు ప్రోత్సకం తో పాటు పేద విద్యార్థులకు ఆర్థికంగా చేయూత ఇవ్వడానికి కమిటి సభ్యులు అందరూ ముందుటున్నారని, మునుముందు విద్యార్థులకు ఎలాంటి సహాయాన్ని అయిన చేయుటకు కమిటీ ముందుకొస్తుంది అని అన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉజ్వల భవిష్యత్ ని కలిగి వుండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గౌరవ సలహాదారులు వీరపనేని చెన్నకేశవులు, ప్రధాన కార్యదర్శి తోటకూరి సతిష్ కుమార్, కోశాధికారి మానుకొండ ఉమాకర్, కమిటీ సభ్యులు విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రజల దాహార్తి తీర్చేందుకు సర్పంచ్ కృషి



**ప్రజాపక్షం/పెనుబల్లి:** ఓట్లు వేసి గెలిపించిన తన గ్రామ ప్రజలకు సేవ చేసేందుకు వారి సమస్యలను పరిష్కరించేందుకు శ్రీకారం చుట్టారు పల్లి గ్రామ సర్పంచ్ బానోతు పాప. గత రెండేళ్లుగా పంచాయతీ పాలకవర్గం లేకపోవడంతో పెనుబల్లి పంచాయతీ ప్రజలకు అనేక సమస్యలు ఎదురుచూస్తున్నాయి. అందులో భాగంగా మొదటి సమస్య పరిష్కార దిశగా అడుగులు వేస్తూ తాగు నీటి సమస్యపై దృష్టి సారించారు. ఈ క్రమంలో శుక్రవారం రాతోని చెరువు నీటిలో మునిగిన మోటార్లను బయటికి తీసి మరమ్మతులు చేయించారు. పెనుబల్లి గ్రామ ప్రజలకు దాహార్తి చీర్చేందుకు సర్పంచ్ పాప చేస్తున్న ప్రజలు హర్షిస్తున్నారు. దాహార్తి తీర్చేందుకు అధికారులు సర్పంచ్ సహకరించాలని పెనుబల్లి ప్రజల కోరుతున్నారు. తాత్కాలిక నీటి సమస్యను తీర్చేందుకు ఇంటి అవసరాలకు గ్రామపంచాయతీ ట్రాక్టర్ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేసి ప్రజలకు అందించారు. ప్రమాణ స్వీకారం చేసిన ప్రతి రోజులకే ప్రజా సమస్యలపై దృష్టి సారించి దగ్గరుండి పర్యవేక్షిస్తుంది. సర్పంచ్ పనితీరుకి పలువురు అభినందనలు తెలుపుతున్నారు.

# అంగరంగ వైభవంగా క్రిస్మస్ వేడుకలు



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** మండల పరిధిలోని ఏలువారిగూడెం గ్రామంలో బేతోలు చర్చి పాస్టర్ నందిగామ అమృతరెడ్డి చర్చి ప్రార్థన మందిరంలో గురువారం రాత్రి క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకులకు ఎన్ఆర్ఐ పిసిసి అధ్యక్షులు యల్మారెడ్డి నరేంద్ రెడ్డి ప్రముఖ న్యాయవాది ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏసుక్రీస్తూ మనుషుల పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల దయ, శత్రువుల పట్ల క్షమాగుణం కలిగి ప్రజలను మంచి మార్గం వైపు నడిపించారరని తెలిపారు. మనుషుల మధ్య ఐక్యత, త్యాగభావనతో పాటు తోటి వారికి నిస్వార్థ సేవ చేయాలన్న క్రీస్తు బోధనలు అందరికీ ఆదర్శమని అన్నారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని క్రైస్తవ మతస్తులు తెల్లవారుజాము నుంచే ప్రార్థినా మందిరాల్లో ప్రత్యే ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం యేసు జన్మదిన కీర్తనలతో పురవీధుల్లో ఆనందోత్సహాల మదద్య సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బేతోలు చర్చి ఫాస్టర్ నందిగామ అమృతరెడ్డి, ఎన్నారై పిసిసి అధ్యక్షులు ఎల్మారెడ్డి, నరేందర్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది ముదిరెడ్డి నిరంజన్‌టెడ్డి, నందిగామ అశోక్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ బాణోతు లక్ష్మి, ఉపసర్పంచ్ దేవారం దేవందర్‌రెడ్డి, యల్మారెడ్డి, అశోక్‌రెడ్డి చింతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇదెక్కడి చోద్యం..!

## -ఒకే నెంబర్, ఒకే పేరుతో ఇద్దరికీ ఖాతాలు



**ప్రజాపక్షం/కారేపల్లి:** ఒకటే బ్యాంకులో ఒకే పేరుతో, ఒకే ఖాతా నెంబర్‌తో ఇద్దరికి అకౌంట్ ఉండటం ఆశ్చర్యకరంగా మారింది. ఒకరికి చెందిన డ్వాక్రా రుణం డబ్బులు 1లక్షల 90వేల రూపాయలు మరొకరి ఖాతా లో జమ అయ్యాయి. మాదారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో ఒకే నెంబర్ ఒకే పేరుతో ఇద్దరికి అకౌంట్ ఖాతా ఉండటం, అకౌంట్ ఒకరి పేరు మీద ఉంటే బయోమెట్రిక్ వేరొకరికి ఇచ్చారు. సింగరేణి మండలంలో గుంపెల్లగూడెం గ్రామానికి చెందిన గుగులోతు సునీతకు మాదారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్‌లో అకౌంట్ నెంబర్ 3579285296తో అకౌంట్ ఉంది. అదే విధంగా మండల పరిధిలోని వెంకట్యాతండాకు చెందిన మరో మహిళ గుగులోతు సునీతకు కూడా ఇదే మాదారం బ్యాంక్‌లో అదే అకౌంట్ నెంబర్ 3579285296తో మరో ఖాతా ఓపెన్ చేసి ఇచ్చారు. రాజీవ్‌గాంధీ గ్రూపు పేరుతో ఉన్న డ్వాక్రా సంఘంలో గుంపెళ్ళగూడెం గ్రామానికి చెందిన సునీత సభ్యురాలు కావడంతో తనకు 1,90,000 రుణం లభించింది. డిసెంబర్ 16వ తారీఖున ఒక్కొక్క సభ్యురాలికి 1,90,000 చొప్పున రుణం మంజూరు అయ్యింది. గుంపెల్లగూడెం గ్రామానికి చెందిన సునీత ఖాతాలో జమ చేయాల్సిన డబ్బును వెంకట్యాతండాకు చెందిన గుగులోతు సునీత ఖాతాలో జమ చేశారు. డ్వాక్రా నగదు జమ గురించి గంపెల్లగూడెం గ్రామానికి చెందిన సునీత డబ్బుల కోసం బ్యాంకుకు వెళితే మీ ఖాతాలో డబ్బులు కేవలం 54000 మాత్రమే ఉన్నాయని చెప్పారు. డ్వాక్రా రుణం డబ్బులు జమ కాలేదని చెప్పడంతో సదరు సభ్యురాలు అవాకయ్యారు. ఏమి జరిగిందని చూస్తే బ్యాంకు అధికారుల పొరపాటు వల్ల వేరే వ్యక్తి ఖాతాకు డబ్బులు వెళ్లిపోయాయి. ఈ డబ్బులను సదరు వ్యక్తి నుండి తిరిగి రివకరీ చేసి అసలు సునీత ఖాతాల్లో తిరిగి జమ చేయాల్సి ఉన్నది. పొరపాటును వెళ్లిన వ్యక్తి నుండి రికవరీ చేయాల్సి ఉంది. బ్యాంకు అధికారుల పొరపాటును గురించి ఖమ్మం బ్యాంక్ హెడ్ ఆఫీస్ అధికారికి ఫిర్యాదు చేస్తామని బాధితురాలు తెలిపారు.

# బలహీన కాలువ కట్టతో అప్రమత్తమైన అధికారులు



## కట్ట తెగే అవకాశం ఉన్నందున సరఫరాను నిలిపి వేసిన అధికారులు

**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని చిన్న కోరుకొండి వెన్నవెల్లి మధ్య 23వ కిలో మీటర్ సమీపంలో కాలువ కట్ట తెగే అవకాశం ఉన్నందున ఎన్ఎస్పి సాగర్ అధికారులు అప్రమత్తమై నీటి సరఫరాను నిలిపివేసినట్లు డిఈ రాజరత్నాకర్ తెలిపారు. మూడు రోజులు పాటు నీటిని నిలిపివేసి ఇసుక బస్తాలతో మరమ్మత్తులు చేయడానికి సిద్ధమైనట్లు అధికారులు తెలిపారు. దీనివలన ఎలాంటి ప్రమాదం లేకుండా బలహీన పడిన కాలువ కట్టను మరమ్మత్తులకు సిద్ధమైనట్లు డి ఈ తెలిపారు. ఈ విధంగా మూడు రోజులు పాటు సాగర్ నీటిని నిలిపివేయడం జరిగిందని వారు పేర్కొన్నారు. మధిర బ్రాంచ్ పరిధిలోని మధిర మరియు ఆంధ్రాకు వెళ్లే నీటిని పూర్తిగా నిలిపివేసి మరమ్మతులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. యాసాంగి కాలంలో ముమ్మరంగా నాట్లు వేసే సమయంలో పూర్తిస్థాయిలో నీటి ఆపడం ఇబ్బందికరమని బలహీన కట్టలు వద్ద ముందస్తుగా ప్రణాళికలు లేకుండా ఉండటం రైతుల ఆగ్రహానికి గురవుతున్నారు. అదే విధంగా వెన్నవల్లి వద్ద కూడా కాలువ కట్ట బలహీనంగా ఉన్నా కూడా మరమ్మత్తులు లేకపోవడం పలు విమర్శలకు దారితీస్తుంది. ఇది సాగర్ అధికారులు నిర్లక్ష్యం అంటూ ఆయకట్టు రైతులు రైతులు పలు విమర్శలు చేస్తున్నారు. యాసంగి పంటలు సాగుకు సమయంలో ముందస్తు ప్రణాళిక లేకుండా కాలువ కట్టలు పై ప్రణాళికలు లేకుండా అధికారులు చేస్తున్నారని పలువురు రైతు సంఘం నాయకులు విమర్శిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ రెండు మూడు రోజుల్లో బలహీనత కలిగిన కట్టలను మరమ్మత్తులు చేసి త్వరితగతిన చేసి నీటి సరఫరాను చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

# కందూరు కార్యక్రమానికి హాజరైన వైరా ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిదిలోని అమ్మపాలెంలో శుక్రవారం సర్పంచ్ షేక్ గాలీబ్‌పాషా నిర్వహించిన కందూరు కార్యక్రమానికి వైరా శాసన సభ్యులు మాళోత్ రాందాస్‌నాయక్, రెవిన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆఫీస్ కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి హాజరయ్యారు. వారికి సర్పంచ్ గాలీబ్‌పాషా ఆధ్వర్యంలో మేళతాళాలతో పెద్ద ఎత్తున ఘనస్వాగతం పలికారు. తొలుత ప్రజన్నాంజనేయస్వామి దేవాలయం, హజరత్‌లాల్‌సాబ్ దర్గా వద్ద ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా వైరా శాసన సభ్యులు మాళోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతు కాంగ్రేస్ ప్రభుత్వం ప్రజలకు అందించే సంక్షేమఫలాలు ప్రజలకు చేరేవిధంగా కార్యకర్తలు కృషిచేయాలని పేర్కొన్నారు. సంక్షేమఫధకాల గురించి ప్రజలకు తెలియజేసేవిధంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని తెలిపారు. పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని అన్నారు. గ్రామాల అభివృద్ధిపై సర్పంచ్‌లు ప్రత్యేకదృష్టి పెట్టాలని తెలిపారు. వచ్చే ఎంపిటిసి, జెడ్పీటిసి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంతో కృషిచేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం గాలీబ్‌పాషా కుటుంబసభ్యులు రాందాస్‌నాయక్, దయాకర్‌రెడ్డిలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ శవగాని త్రివేణి, వార్డు మెంబర్లు, గ్రామ, మండల కాంగ్రేస్ నాయకులు పాల్గొన్నారు.

# చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు జాలరి మృతి





**ప్రజాపక్షం/అశ్వాపురం:** చేపల వేటకు వెళ్లిన జాలరి ప్రమాదవశాత్తు మృతి చెందిన సంఘటన చింతిర్యాలలోని గోదావరిలో చోటు చేసుకుంది. అశ్వాపురం సిఐ అశోక్ రెడ్డి మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం అశ్వాపురం మండలంలోని చింతిర్యాలలో నివసిస్తున్న జాలరి నాగుల వెంకటరమణయ్య(45)ప్రతి రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం గోదావరిలో చేపలవేటకు వలకు వేయడానికి వెళ్లి ఇంటికి వస్తాడని కానీ శుక్రవారం రోజు సమయానికి రాకపోయే సరికి ఆయన భార్య వారి బంధువులు గోదావరి వద్ద వెతకగా బోటు ఉందని మనిషి కనపడలేదని భయాందోళనకు గురై వారు పోలీసువారికి సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తులతో గాలిస్తూ, అగ్ని ప్రమాద శాఖకు, ఎన్‌డిఆర్‌ఎఫ్, రెస్క్యూటీమ్‌కు సమాచారం అందించామని, వారు వచ్చిన వెంటనే వారితో గాలించి మృతదేహాన్ని వెలికి తీశామని అన్నారు. మృతుడు మెడ చుట్టూ చలికాలంలో కప్పుకున్న రగ్గు ఉండటంతో వలవేయడానికి మోటార్ బోటును ఉపయోగిస్తుండగా మోటారు తీగలో రగ్గు చుట్టుకొని మెడకు బిగుసుకుపోవడంతో మృతి చెంది నీటిలో పడిపోయాడని గుర్తించామన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని అన్నారు.

# నిరుపేదలకు అండగా సిపిఐ జెండా



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ)వంద సంవత్సరాలు పూర్తి చేసుకుని నూట ఒకటవ సం వత్సరంలోకి అడుగు పెడుతున్న క్రమం లో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సారపాక పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సిపిఐ ఆఫీస్ పై సిపిఐ అరుణ పతాకాన్ని ఎగరవేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యు లు ముప్వ వెంకటేశ్వరరావు(లడ్డా), జిల్లా సమితి సభ్యులు పేరాల శ్రీనివాసరావులు మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26 కాన్పూర్‌లో ఆవిర్భవించిన సిపిఐ పురిటిలో ఎన్నో నిర్భంధాలు, నిషేధాలు, కుట్రలు కేసులు ఎదుర్కొందని అన్నారు. అదే విధంగా మరెన్నో త్యాగాలు, నాటి నుండి నేటి వరకు అమరవీరుల అరుణ రక్తపు ధార సాక్షిగా ఎరుపెక్కిన ఎర్ర జెండా వంద ఏళ్లుగా రెపరెపలాడుతునే ఉందన్నారు. ఈకార్యక్రమంలో భాస్కర్‌నగర్ శాఖ కార్యదర్శి వంగలపాటి నాగేశ్వరరావు, మేజర్ గ్రామ పంచాయితీ ఆరో వార్డు సభ్యురాలు భూక్య హైమావతి, శ్రీరాంపురం ఎస్టీ కాలనీ శాఖ కార్యదర్శి రాజేష్, జగ్గయ్య, సీతారామయ్య, బాబురావు, బసప్ప క్యాంప్ సిపిఐ నాయకులు వహీద్, సారపాక యూత్ నాయకులు సుమంత్, పండు తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణమూర్తి కుటుంబానికి పరామర్శ



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** సారపాక గ్రామ పంచాయితీలో గల వైష్ణవి మిల్స్ కృష్ణమూర్తి చిన్న కుమారుడు సాయి శబరిమల యాత్ర ముగించుకుని తిరుగు ప్రయాణంలో త్రివేం డ్రం వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రస్తుతం త్రివేండ్రం హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈవిషయం తెలిసి వారి నివాసానికి వెళ్లి కుటుం బ సభ్యులను పరామర్శించి, ఓదార్చి ధైర్యం చెప్పి, వైద్య ఖర్చుల నిమిత్తం మాజీ జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలత 10వేల రూపాయలు, లక్ష్మీ పురం ఉపసర్పంచ్ యారం పున్నారెడ్డి 5వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈకార్యక్రమంలో సారపాక టౌన్ యూత్ అధ్యక్షులు సోము లక్ష్మీ చైతన్యరెడ్డి, బండారి లక్ష్మీ నారాయణ, పంగి సురేష్, బండారి వంశీ, వెల్లిశెట్టి పవన్, దనుష్, సానికొమ్ము అజయ్‌కుమార్‌రెడ్డి, పార్టీ నాయకులు, బంధు మిత్రులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ వీరప్రతాప్‌కు సన్మానం



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి గ్రామ పంచాయితీ సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ (టోనీ)ను అప్పాయిగూడెం పంచాయితీకి చెందిన ఎంఎల్‌ఏ రాందాస్ నాయక్ ముఖ్య అనుచరులు ఎస్ఎన్ నాయక్, గుగులోత్ లచ్చిరాం నాయక్, వంకుడోత్ హార్జ్యనాయక్, లక్ష్మ ణ్ నాయక్, వెంకన్నలు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయితీ అభివృద్ధిలో ముందు ఉండేలా పని చేయాలని, ప్రజలకు ఏ సమస్య వచ్చిన వెంటనే స్పందించాలని సూచించారు. సర్పంచ్‌గా ఎన్నికైనందుకు అభినందనలు తెలిపారు.

# సొంత నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** బచ్చోడు గ్రామాల్లో ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో తమ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం గుజ్జు రామకృష్ణ, సందు రాజు 7, 9 వార్డుల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. బచ్చోడు గ్రామంలో గ్రామపంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ తరుపున 7వ వార్డులో గుజ్జు రామకృష్ణ, 9వ వార్డులో సందు రాజు పోటీ చేసి భారీ మెజార్టీతో విజయం సాధించగా, తమ వార్డులో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం తమ వార్డులను అన్ని విధాల అభివృద్ధి చేస్తామని హామీ ఇవ్వటంతో గెలుపొందిన వెంటనే 7, 9 వార్డుల్లో గ్రావెల్ తో గుంటలను పూడ్చి వార్డుల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. దీంతో వార్డులో ఉన్న ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ నాయకులు రామకృష్ణ, రాజు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించినందుకు 7, 9 వార్డుల ప్రజలకు రుణపడి ఉంటామన్నారు. వార్డుల అభివృద్ధికి ప్రజల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో గ్రామపంచాయతీని కైవసం చేసుకుని గ్రామఅభివృద్ధికి కూడా పాటుపడతామని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రజల తీర్పుతో కాంగ్రెస్ విజయం



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన ఘన విజయం ప్రజల నమ్మకానికి ప్రజాస్వామ్య విలువలకు అద్దం పడుతోందని, ప్రజలు ఇచ్చిన ఈ తీర్పు అధికారానికి కాదు నిజాయితీకి, ప్రజల పక్షాన నిలిచే రాజకీయానికి ఇచ్చి మద్దతుగా నిలించిందని, ఈ విజయం సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గెలుపు ఒక్క నాయకుడి విజయమేగాక ప్రతి కార్యకర్త చేసిన పోరాటానికి, ప్రతి ఓటరు వ్యక్తం చేసిన ఆశకు ప్రతిబింబమని స్పష్టం చేశారు. ఈ సభలో ఆయన మాటలు కార్యకర్తలతో నూతన ఆత్మవిశ్వాసాన్ని నింపాయి. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షులు పాయం రామనర్సయ్య, సభ అధ్యక్షులు, మాజీ ఎంపీపీ పడిగ సమ్మయ్య, మహిళ అధ్యక్షురాలు గలిగ సమ్మక్క, కాంగ్రెస్ పార్టీ మండల కోప్రచార కమిటీ అధ్యక్షులు వాసం శ్రీకాంత్, మండల ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.